

# వెలుగులోకి

కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

"అమ్మా! అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారు అని ఆఫీసు ప్యూను బసవన్న వర్తమానం మోసుకొచ్చాడు

చేసే టైపు మేటరు అలానే మధ్యలో వదిలేసి శైలజ స్వింగ్ డోర్ తెరచి మే ఐ కమిన్ సర్ అంది బాస్ తలెత్తి యస్ టేక్ యువర్ సీట్ అంటూ కుషన్ సీటు చూపించాడు ఆమె సీటులో కూర్చుంది స్టెనో గ్రాఫ్ నోట్‌బుక్ టేబిల్‌పై పెట్టి హెచ్ బి పెన్సిల్ కుడి చేతో పట్టుకుంది డిక్టేషన్ తీసుకునే పోజులో కూర్చున్న శైలజను చూసి మిమ్మల్ని పిలిచింది అఫిషియల్ పని మీద కాదు పర్సనల్‌గా మీతో కొంచెం మాట్లాడాలి అని సన్నగా దగ్గి గొంతు సర్దుకున్నాడు నిరంజనరావు

శైలజ తలెత్తి చూసింది బాస్ చాలా హేపీ మూడ్‌లో ఉన్నాడు హెల్మెట్ పెట్టినా చెరగని గిరిజాల జుట్టు యవ్వనం కొట్టొచ్చినట్టు కనపడే ఆకర్షణీయమైన ముఖవర్చస్సు ఎప్పుడూ ట్రిమ్‌గా ఉండే అతని డ్రస్ మనసులో దాగినది ఎలా వ్యక్తీకరించాలాని తడబాటు పడుతున్న అతని ప్రయత్నం అన్నీ లిప్త పాటులో శైలజ గమనించింది అనూహ్యమైనది ఏమి వినాల్సి వస్తుందానే తొట్రుపాటుతో ఎత్తిన కను రెప్పలు వాల్చేసింది

మీకు అభ్యంతరం లేకుంటే మీతో ఓ విషయం చెప్పాలి అఫ్‌కోర్సు నా పర్సనల్ విషయమనుకొండీ అని ఆగాడు

అంత అభ్యంతరమైంది సారు నాకు చెప్పకపోయినా పర్వాలేదు సర్' అంది

ఎస్, అలాంటిదేమీ కాదు ఐదు సంవత్సరాలుగా మీరు ఈ ఆఫీసులో పని చేస్తున్నారు మీరు చాలా జంటిల్ ఉమెన్ మిమ్మల్ని ఇబ్బంది పెట్టే ప్రస్తావన మీ ముందు తీసుకురాను

అలాయితే చెప్పండి అంది కానీ లోలోపల ఎలాంటి విషయం వినాల్సి వస్తుందాని కొంచెం వణికింది

అదే మ్యారేజ్ ప్రొపోజల్ గురించి మాట్లాడదామని ఆగాడు నిరంజనరావు

శైలజ మౌనంగా చూస్తోంది మళ్ళీ అతనే అన్నాడు

ఐ మీన్ మీ మ్యారేజ్ గురించి సంప్రదిద్దామని మా ఇంటి అడ్రసు మన ఆఫీసులో ఉంది నా జాబ్ అప్లికేషన్‌లో నేను రాశానని బాగా జ్ఞాపకం మీరు మా తల్లిదండ్రులతో నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు వాళ్ళకు ఇష్టమైతే నా కేమి అభ్యంతరం ఉండదు

థ్యాంక్యూ వెరీమచ్ మీ వాళ్ళతో మాట్లాడే ముందు మీ అభిప్రాయం తెల్సుకుంటే మంచిదని తీరా వాళ్ళు ఒప్పుకున్నా మీరు కాదంటే లాభం లేదుగా అంతిమ నిర్ణయం మీదేగా అన్నాడు నిరంజనం

అలాని మీరు సందేహించక్కర్లేదు మా తల్లిదండ్రుల నిర్ణయమే నా నిర్ణయం నా బాగోగులు నా కంటే వాళ్ళకే బాగా తెలుసని నా నమ్మకం నేను పెద్దలు నిర్ణయించిన పెళ్ళంటేనే ఇష్టపడతాను

అలా చెయ్యడం నాకు ఇష్టమే! అయినా చదువుకున్న వాళ్ళు కదా స్వతంత్ర భావాలు కలిగి ఉంటాయనే ఉద్దేశ్యంతో మీతో చెబుదామనుకున్నాను ఆల్‌రైట్! అలానే చేద్దాం బైది బై ఎలాగో ఇందాకా వచ్చాం కాబట్టి నన్ను చెప్పనివ్వండి నా మిత్రుడు ఒకడు బొంబేలో సేల్స్ ఆఫీసరుగా ఓ పెద్ద కంపెనీలో పని చేస్తున్నాడు మొన్ననే ఓ మీటింగ్‌లో కలిశాం అతడు పిచ్చాపాటీ మాట్లాడుతూ తన పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు అతనికి ఎవ్వరూ నచ్చడం లేదట నేను మీ గురించి చెప్పాను అతను ఏ సంగతి తెల్సుకుని ఉత్తరం రాయమన్నాడు శైలజ గారూ! మీ గురించి నాకు ఎంత బాగా తెలుసో అతని గురించి అంతకన్నా బాగా తెలుసు చాలా మంచివాడు ఏ చెడు అలవాటు లేదు కొద్దో గొప్పో ఆస్తి ఉన్నవాడు గుణవతి రూపవతి అయిన భార్య కావా లంటున్నాడు అలా అనుకోవడంలో తప్పు లేదనుకుంటాను మీ ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు అన్ని విషయాలు అతనితో చెప్పాను కట్న కానుకల గొడవ ఉండదు మీరు అన్యథా భావించకపోతే ఈ సంబంధాన్ని గురించి మీ అభిప్రాయం చెబితే వాడికి ఉత్తరం రాస్తాను పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తాం ఆపై మీ ఇష్టం' అని చక చక అన్ని విషయాలు వెళ్ళగక్కాడు

శైలజ ఆశ్చర్యపోయింది బాస్ ఎంత ఉన్నతుడు! ఏదో వెకిలిచేష్టను బయట పెడతాడని తను తప్పుగా ఊహించింది లోకంలో బాస్‌లందరూ రావణా సురులు కారు నిరంజనరావులాంటి వాళ్ళూ ఉంటారని మనసులోనే అతనికి కృతజ్ఞతలు చెప్పింది పైకి మాత్రం మా వాళ్ళను సంప్రదించండి అని బాస్ దగ్గర సెలవు తీసుకొని తన సీటులోకి వచ్చేసింది

ఆఫీసు గడియారం 5 గం లు కొట్టింది శైలజ గుండెల్లో జేగంటలు మ్రోగాయి త్వరగా ఇంటికి వెళ్ళాలి అమ్మతో బాస్ చెప్పిన చల్లని కబురు చెప్పాలి అమ్మ ఎంత ఆనంద పడిపోతుందో! తలపై ఉన్న పెద్ద బరువు కిందకు దింపినంత ఆనంద పడిపోదూ! ఇన్నాళ్ళు కట్నం బెడదతో దడిసి నా పెళ్ళి మాట ఎత్తలేదు కానీ కట్నం లేకుండా మంచి సంబంధం వస్తోందంటే ఎవరు మాత్రం కళ్ళకద్దు కోరూ! రెక్కలు కట్టుకొని ఇంట్లో వాలాలి బాస్ కంటే ముందుగానే ఇంటికి చేరుకోవాలి

చా! ఈ పాడు సిటీ బస్సులు ఒక పట్టాన రావు! వచ్చినా గర్భిణీ స్త్రీలా వచ్చి బరువుగా ఆగుతాయి అప్పుడే 6 గం అయిపోయింది ఈపాటికి బాస్ కార్లో ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడు అమ్మతో తన పెళ్ళి గురించి మాట్లాడుతుంటాడు ఇదీ ఒకందుకు మంచిదే! మధ్యలో వెళితే బాగుండదు అసలే తనకసలు చచ్చే సిగ్గు

ఇంటికి రాగానే అమ్మ ముఖం కోటి కాంతులతో మెరిసిపోతూంది అప్పుడే ఎవరో వచ్చి వెళ్ళినట్టు ఉన్నారు కాఫీ ప్లేట్లతో గ్లాసులతో టీపాయి అస్తవ్యస్తంగా ఉంది ఇల్లంతా సందడిగా ఉంది

శైలూ! వచ్చావామ్మా! నీ మాటే అనుకుంటున్నాం నీకు నూరేళ్ళు అమ్మ ఎంతో సంబరంగా దగ్గరకు తీసుకుంది 'శైలూ! నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి అలా గదిలోకి రా ఏకాంతంగా మాట్లాడదాం అంటూ అమ్మ వసారాలోంచి లోపలికి దారి తీసింది

శైలజ మనసు ఆనంద పరవశమవుతూంది బాస్ అప్పుడే వచ్చేశాడన్న మాట ఆయన సంగతి తనకు బాగా తెలుసు ఉన్న పళాన అన్నీ జరిగిపోవాలి క్షణం ఆలస్యం అవకూడదు ఏదైనా అర్జంటు మేటరు ఇచ్చినా కాలుగాలిన పిల్లిలా తిరుగుతాడు కాలింగ్ బెల్లు నొక్కుతాడు ఉండబట్టలేక తనే సీటు దగ్గరకు వచ్చి నిలబడతాడు ఆయన ప్రక్కన నిలబడితే అసలు తను చేసే పని సరిగా చేయలేదు చేతులు వణికి ఒక అక్షరానికి బదులు మరో అక్షరం టైపు చేస్తుంది అందుకే బాస్ అర్జంట్ అంటే చాలు సగం టైపు చేసిన మేటరు కూడా ప్రక్కకు పెట్టి అది చేస్తుంది

శైలూ!' అన్న పిలుపుకు మన లోకంలోకి వచ్చింది

పెళ్ళివారు వచ్చారమ్మా ఏదైనా మా అమ్మాయిని కనుక్కునిగానీ చెప్పలేం అని చెప్పేశాను అంది అమ్మ

'నాకు చెప్పేదేముందమ్మా మీరంతా ఎలా

అనుకుంటే అలానే నేను మీ మాట ఎప్పుడైనా కాదన్నానా! తల్లికన్నా ఈ లోకంలో దగ్గరైన వాళ్ళు ఎవరుంటారు చెప్పు?' అంది శైలజ

"నాకు తెలుసు తల్లీ నీ మనసు అయినా నువ్వు 'ఊ' అంటే కదా మిగతా విషయాలు మాట్లాడ గలిగేది అబ్బాయి గొప్ప ఉద్యోగస్తుడు బొంబాయిలో పని చేస్తున్నాడుట ఎంతో గుణవంతుడుట '

' నాకన్నీ ముందే తెలుసమ్మా మీరు అనుకున్నట్టే పెళ్ళి చూపులకు రమ్మనండి" ఎంతో నమ్రతగా అంది

'ఆదేమిటే! నీకెలా తెలుసు? అయినా పెళ్ళి చూపులకు మళ్ళీ రమ్మనడం దేనికో! ఇప్పుడేగా వచ్చి చూసి వెళ్ళారు' ఆశ్చర్యంగా అంది శైలజ తల్లి

'అది కాదమ్మా! ఎవరో చెప్పినంత మాత్రాన సరిపోదుగా! పెళ్ళి కొడుకుకు నచ్చాలిగా మీరూ అబ్బాయిని చూడాలిగా

నువ్వు చెప్పేది నాకేమీ అర్థం కావడం లేదు ఇప్పుడే పెళ్ళికొడుకూ అతని తల్లి తండ్రీ అందరూ వచ్చారు పిల్ల నచ్చిందని చెప్పారు నువ్వు సరే అంటే తాంబూలాలు పుచ్చుకునేందుకు రేపు దశమినాడు వస్తారు

శైలజకు మతిపోయింది ఇంతసేపు తల్లి తన గురించి చెబుతోందని అనుకుంది కానీ అమ్మ చెప్పే తీరునుబట్టి చూస్తే పెళ్ళి సంబంధం తనకు కాదు, తన చెల్లెలు కామాక్షికి తను ఎంత తొందరపడింది తనకో చెల్లి ఉందన్న సంగతే మర్చిపోయింది చాలా పొరపాటు జరిగిపోయింది అయినా పొరపాటంతా తనదే ఎందు కవుతుంది? పెద్ద పిల్ల పెళ్ళి మాట ఎత్తకుండా రెండవ పిల్లకు పెళ్ళి చేయాలనుకోవడం తల్లిదండ్రుల తప్పుకాదా? ఆ విషయం తల్లిని అడిగితే! ఈ లోగా తల్లే అంది


అమ్మా! నీకు మన సంసార పరిస్థితులు తెలియనివి కావు నీ మీదే సంసారం ఆధారపడి ఉంది నీకు చదువు అబ్బింది ఉద్యోగం వచ్చింది నువ్వు తెచ్చే నాలుగు రాళ్ళతో ఇల్లు గుట్టుగా గడిచిపోతోంది నీ పెళ్ళి చేసేస్తే మాకు ఇంకెవ్వరు దిక్కు? అందుకే కామాక్షి పెళ్ళి తలపెట్టాం నువ్వు అన్యదా అనుకోకు బాధ్యతలు గట్టెక్కాం తర్వాత నీ పెళ్ళి ప్రయత్నమూ చేస్తాం

శైలజకి అంతా అగమ్య గోచరంగా ఉంది స్వార్థమనే వలలో ఈ భూగోళం చిక్కుపడి బయటకు రాలేక బాధపడుతున్నట్లు అనిపించింది ఏదో అజ్ఞాతమైన శక్తి తల్లి బిడ్డల సంబంధాన్ని దారుణంగా ముక్కలు ముక్కలు చేస్తున్నట్లు ఉంది ఆ అజ్ఞాత శక్తి ధనం కావచ్చు అవసరం కావచ్చు మరేదైనా బలీయమైన శక్తి కావచ్చు అందువల్ల నష్టపడేది మాత్రం తనలాంటి ఆడదే! చదువు సంపాదన, గుణం అన్ని ఉండీ పెళ్ళికి అనర్హురాలయింది ఏ చదువు సంధ్యలు లేకుండా రికామీగా ఇంట్లో పడివుంటున్న కామాక్షి అర్హురాలయింది తను చేసిన నేరమేమిటి? చదువు కోవడమేనా? సంపాయించి తల్లిదండ్రులను పోషించడమేనా! ఇప్పుడు తను తల్లికి ఇవన్నీ ఎలా నచ్చచెప్పగలదు? అమ్మా! నేను అందరిలాంటి ఆడపిల్లను ఎదిగిన ఆడపిల్లను నాకూ కోరిక లుంటాయి నేనూ పెళ్ళి చేసుకుని ఓ ఇంటిదాన్ని అవ్వాలని ఆశిస్తాను తన మనసులోని మాట చెబితే లోకం హర్షిస్తుందా! అంతెందుకు కన్నతల్లి



## కబీరు భావాలు : ఆరుద్ర బట్వాడా






# తిండి తిప్పలు

భుక్తి గడచిన భక్తి కుదురును
బువ్వ పిదపే ముక్తి చింతన
పుడమిలో నీ భక్తుడిని నా
గొడవ చూడుము దేవ దేవా!

చిత్తగించుము రిక్త కడుపున
సత్తువుండదు భక్తి నిలువదు
చేతులెత్తి నమస్కరించే
చేవ చచ్చిన దేహమెందుకు?

తమ ఫలాలను తినవు తరువులు
తమ జలాలను త్రాగ వేరులు
దేహధారులు భక్తి పేరిట
దేహమేల కృశింపజేతురు

చేవయన్నది చెట్టుకుంటే
తేమ వలపును తెలిసి పీల్చును
మ్రోడుకెట్లా తెలియు? కురిసే
మొయిలు గుంపుల రాకపోకలు?

కడలి యందున ఆలిచిప్పలు
కనలు దప్పికచేత, అయినను
పుచ్చుకొనవే వాన బిచ్చము
స్వాతి చినుకుకె నోరు తెరచును

నిన్నుగాక మరెవ్వరిని నే
నిలదీసి అడుగను తిండి గింజలు
ఈయకున్నను నిన్ను బాయను
త్రోయగలడె కబీరు మాయను?

పొట్ట నింపే రొట్టె లేనిచో
చేతిలో జపమాల యేలా?
దాసు నాకలి తీర్చకుంటే
తీసుకో నీ మాల నీవే

తిండి కోసము రెండు పూటల
పిండినిచ్చే చేతితో నే
ఉప్పు పప్పు నేయి నొసగిన
ఉండు జీవుడు బొందిలో నే

దిట్టమైనది మంచమొక్కటి
గట్టి తలగడ నిదురకక్కర!
చలిని తాళను గొంగళుంటే
చాలునంతే బ్రతుకు జీవుడ!

కుండ నీటను బోర్లించిన
నిండ జా లదు మునగజాలదు
నింపుకొందును ఈ ఘటమ్మును
నీ కటాక్షము చేత దండిగ

(గమనిక ఇవి ముక్కస్య ముక్కోను వాదాలు కావు మక్కీకి మక్కీ కూడా కావు ఎక్కడికక్కడ)

ఆరుద్ర

## వెలుగులోకి

అవునంటుందా? ఎలా ఈ ఉచ్చు నుండి తప్పుకోనడం! తన పెళ్ళి కాకుండా చెల్లి పెళ్ళి జరిగిపోతే ఏదో లోపం వల్లే ఈ అమ్మ పెళ్ళి కాలేదనుకోరా! ఎలా అమ్మకు నచ్చ చెప్పేది? శైలజ మనసు వికలమయింది

అమ్మా! కామాక్షి పెళ్ళి చెయ్యడానికి నాకేం అభ్యంతరం ఉంటుంది? అలాగే కానియ్యండి అని ముక్తసరిగా అంది

నాకు తెలుసమ్మా నీ పెద్ద మనసు అందుకే నేనూ చూచాయగా ఒప్పుకున్నట్లు చెప్పాను పోతే కట్నం 15 వేలు కావాలంటున్నారు ఎంత లేదన్నా పెళ్ళి ఖర్చు 10 వేలు అవుతుంది అందుకే నువ్వు బ్యాంకులో ఉన్న నీ డబ్బు డ్రా చేసి మిగతా దానికి ఆఫీసులో లోను పెడితే ఈ కార్యం గట్టెక్కుతుంది తర్వాత మన తిప్పలు మనం పడదాం

శైలజ గంభీరమయింది ఇంత కాలం ఇంట్లో ఖర్చు చెయ్యగా మిగిలిన డబ్బు బ్యాంకులో వేసింది చెల్లెలు పెళ్ళికా! అయితే తన పెళ్ళి మాటేమిటి?

అదేమిటమ్మా! అన్నయ్యను కూడా కొంత సాయం చేయ్యమని అడగచ్చుగా! అంతా నేనే ఎందుకు ఖర్చు చెయ్యాలి" అలా చేస్తే రేపు నా గతేంకాను? నిష్కర్షగా అంది

ఎంత ఎదిగిపోయావే! చెల్లి పెళ్ళి మాట విని ఆనందంతో పొంగిపోతావనుకున్నాను ఇంత ఈర్ష్య చెందుతావని కలలో కూడా అనుకోలేదు అయినా అన్నయ్య సంగతి నీకు తెలియంది కాదు! పెళ్ళి అయిందగ్గర్నుంచి వాడు రాగి కాణీ మనకు సాయం చెయ్యలేదు ఇప్పుడు మాత్రం చేస్తాడని ఎలా అనుకున్నావు?"

"అవునమ్మా! నువ్వు చెప్పింది నిజమే! దున్నే ఎద్దుకే తన్నులు ఇప్పుడిప్పుడే నాకు అర్థమవుతోంది అడ్డాల్లో ఉండగా చూసినట్టుగా పెద్దయిన తర్వాత మీరు మమ్మల్ని చూడరూ అని! కానీ నేను ఎచ్చి ప్రేమలో పడి సర్వం మీరేనని ఆశించాను మీ సమస్యలు మీకున్నాయి కాదనను కన్న కూతురుగా నేను పాలు పంచుకోవాలి అందుకు వ్యతిరేకంగా చెప్పడం లేదు అయితే పెద్ద కూతురు పెళ్ళి మాటే ఎత్తకుండా చిన్న కూతురు పెళ్ళి చెయ్యాలనే మీ ఉద్దేశ్యాన్ని మాత్రం నేను భరించలేను ఇంత కాలం మీ నీడన బ్రతికాను కాబట్టి నా ఎకౌంటులో డబ్బు డ్రా చేసి ఇస్తాను ఎలాగో కామాక్షి పెళ్ళి చేసెయ్యండి నాన్న పెన్షన్‌తో నువ్వూ నాన్న కాలం గడపండి నేను మాత్రం ఈ ఇంట్లో ఒక్క క్షణం ఉండను వర్కింగ్ ఉమెన్సు హాస్టల్లో చేరతాను నా పెళ్ళి గురించి నేనే నిర్ణయం తీసుకుంటాను అనేసి ఉద్వేగంతో బయటకు వచ్చేసింది

ఆటో లో వెళుతుంటే బాస్ గుర్తుకు వచ్చాడు కన్న తల్లి కంటే బాస్ ఎంత ఉత్తముడు ఆయనకు ఉన్న ధ్యాసలో రవ్వంత అమ్మకు ఉన్నా కట్టుబట్టలతో ఇల్లు విడిచి బయటకు రావలసిన అగత్యం తనకు ఉండేది కాదు కదా!

రేపే బాస్‌కు తన నిర్ణయం చెప్పాలి అని శైలజ గట్టిగా నిశ్చయించుకుంది ఆటో హాస్టలు ముందు ఆగింది □